

# దాల్‌గోట్నీ దెబ్బ

## పప్పుగుత్తి దెబ్బ

ఒకూర్లో ఒక రుస్తుం పైల్వాన్ ఉన్నాడు. చేతికి కడియం, మెడలో తావీజు, దండాలు బస్కీలు తీసి నున్నగా మెరస్తా ఉన్న ఒళ్లు... పైల్వాన్ అంటే ఆయన గదా అని అందరూ అనుకుంటా ఉండేవాళ్లు.

చాలామంది ఆ రుస్తుం పైల్వాను కాడ శిష్యులుగా చేరి మంచి మంచి కుస్తీ పట్లు నేర్చుకొని వాళ్లు కూడా పేరు తెచ్చుకోవడం మొదలుబెట్టినారు.

అయితే ఈ మధ్యనే రుస్తుం దగ్గర ఒక కొత్త శిష్యుడు చేరినాడు. వాడు బలే హుషారు.

పగలు పొద్దస్తం గురువు కాడ చేరి ఆయనకు ఆ మాటలు చెప్తా ఈ మాటలు చెప్తా ఒళ్లు పడతా మాలీష్ చేస్తా మంచిగా ఐసు చేసుకున్నాడు. దాంతో రుస్తుం పొంగిపోయి-

'అబ్బ... నువ్వురా శిష్యుడివంటే' అనేసి ఆయనకు తెలిసిన పట్లన్నీ నేర్పించడం మొదలుబెట్టినాడు.

రుస్తుం భార్య ఇదంతా గమనిస్తా ఉంది. గమనించి గమనించి ఒకరోజు రుస్తుంతో-

'జీ... నీ పద్ధతి నాకేమీ నచ్చడంలా. కొత్తగా వచ్చినోడు అంత సక్కరమైన వాడు కాదని అనిపిస్తా ఉంది. నువ్వేమో మునగచెట్టు ఎక్కినోడి మాదిరిగా నీకు తెలిసిన విద్యలన్నీ కాయలుగా కోసి వాడి జోలీలో పోస్తా ఉన్నావు. కొన్ని నువ్వు కూడా దాచుకో. గురువంటే ఎవరు? శిష్యులకు తెలియనిది ఏదో తెలిసినవాడు. గురువు ఎప్పుడూ గురుస్తానంలో ఉండాల. ఎందుకు చెబుతున్నానో అర్థం చేసుకో. లాకుంటే తర్వాత బాదపడాల్సి ఉంటుంది' అని చెప్పింది.

రుస్తుం వినలా. 'అహె... మావాడు అట్టాంటి వాడు కాదు' అనేసి తనకు తెలిసిన లాస్టు కుస్తీ పట్టు కూడా నేర్పించేసినాడు.

ఎప్పుడైతే లాస్టు పట్టు కూడా తెలిసిపోయిందో అప్పుడే ఆ మినిట్టులోనే ఆ టక్కులమారి శిష్యుడు బజారులోకి వచ్చేసి గోదాలోకి దిగేసినాడు.

'బస్తీలో సవాల్. ఇవ్వాల్టి నుంచి ఈ ఊర్లో నేనే పెద్ద పైల్వాన్‌ని. కావాలంటే ఎవరైనా పోటీ పడొచ్చు. వాళ్లందరినీ ఓడిస్తా. ఆఖరికి మా గురువుగారినైనా సరే. బస్తీమే సవాల్. ఓయ్... గురువా... రా దమ్ముంటే'' అని రుస్తుంనే సవాలు చేస్తా రంకెలు వేస్తా ఉన్నాడు.

ఆ మాటలు చెవిన పడగానే రుస్తుం బెదిరిపోయి యింట్లోకొచ్చి కూర్చున్నాడు.

గోదాలో దిగితే తను శిష్యుడికి సమానం కాగలడుగానీ పైచేయి మాత్రం కాలేడు. ఎట్టా అని మొకం నల్లంగా పెట్టుకొని కళ్లల్లో నీళ్లు తెచ్చుకున్నాడు. ఇన్నాళ్ల గురుస్తానంలో ఉన్నవాడు ఒక్కసారిగా ఈ అవమానాన్ని తట్టుకోగలడా?

రుస్తుం భార్య ఇదంతా చూస్తానే ఉంది. అప్పుడామె పొయ్యి ముందర కూర్చొని దాల్‌గోట్నీ (పప్పుగుత్తి)తో పప్పు మెదపతా ఉంది.

'నేను చెబితే విన్నావా? వద్దయ్యా వాడికి అన్నీ చెప్పొద్దు అనంటే ఎగురుకుంటా అన్నీ చెప్తివే అనుబవించు' అంది.

గురువు దీనంగా చూసినాడు భార్య వంక.

'అదా.. నువ్వు నాకు చెప్పేమాట. కష్టకాలంలో తోడు నిలవడం భార్య ధర్మం కదా' అన్నాడు ఆమెతో.

గురువు భార్యకు జాలి కలిగింది. మొగుడి మర్యాదే కదా ఇంటి ఇల్లాలి మర్యాదా. అందుకని ఆలోచించి ఆలోచించి చేతిలో ఉన్న పప్పు గుత్తిని చూసి 'ఆ ఐడియా.. ఇదిగో.. ఈ దాల్‌గోట్నీ తీసుకొని నేరుగా గోదాలోకెళ్లి నేల మీద పాతు. అప్పుడు నీ శిష్యుణ్ణి పిలు. రా రా.. చూసుకుందాం.. ఇప్పుడురా.. వచ్చావంటే దాల్‌గోట్నీ దెబ్బ కొడతా అని చెప్పు. దెబ్బకు దడుసుకొని నీ కాళ్ల దగ్గిర పడతాడు' అనంది.

'దాల్‌గోట్నీ దెబ్బ ఏంది? అట్టాంటి పట్టు నాకు తెలియదే' అన్నాడు రుస్తుం అమాయకంగా.

'తెలియబళ్లా. పో. నేను చెప్పినట్టుగా చేయి చాలు' అంది రుస్తుం భార్య.

రుస్తుంకు ధైర్యం వచ్చేసింది. ఛాతీ నిండుగా గాలి పీల్చి, భార్య చేతిలో ఉన్న దాల్‌గోట్నీ తీసుకొని నేరుగా గోదాలోకి పోయాడు.

చేతిలో దాల్‌గోట్నీతో, మొకాన కోపంతో, కండలు పొంగించి వస్తున్న రుస్తుంను చూసి శిష్యుడు కంగారు పడ్డాడు. అయినా పైకి ధైర్యంగా తొడగొట్టి బస్తీమే సవాల్ అన్నాడు.

రుస్తుం నేరుగా గోదాలో దిగి దాల్‌గోట్నీని నేలమీద పాతాడు. పాతి పెద్దగా నవ్వాడు.

'ఒరే.. శిష్యుడుగా.. నీకు నేను అన్ని పట్లు చెప్పేశానని నువ్వు అనుకుంటా ఉన్నావు కదా. లేదురా.. నీలాంటి వాళ్ల కోసం నా దగ్గర దాల్‌గోట్నీ పట్టు దాచి పెట్టుకొని ఉంటా. ఇప్పుడు రా. వచ్చావనుకో.. నిన్ను దాల్‌గోట్నీ దెబ్బ కొడతా. ఎట్టా కొడతానంటే నువ్వు దెబ్బకు ఎగిరి యాడ పడతావో నాకే తెలియదు. రారా పుడింగి' అని పిలిచే సరికి శిష్యుడు బిక్కమొకం పెట్టేసినాడు.

ఏమో గురువుకు నిజంగానే దాల్‌గోట్నీ దెబ్బ తెలుసేమో అనుకొని రుస్తుం కాళ్ల మీద పడి 'ఉస్తాద్.. మన్నించు.. ఏదో కుర్ర చేష్టతో వాగాను. నువ్వెక్కడా? నేనెక్కడా? నీ దాల్‌గోట్నీ దెబ్బ తింటే నేనేమైపోదును.. తప్పు కాయి' అంటూ బుద్ధిగా చెంపలు వేసుకున్నాడు.

రుస్తుం హాయిగా నవ్వుకొని ఇంటికి వెళ్లి భార్యకి బోలెడన్ని షుక్రియాలు చెప్పుకున్నాడు.

ఆనాటి నుంచి రుస్తుంను అందరూ దాల్‌గోట్నీ పైల్వాన్ అని పిలస్తా ఉండేవాళ్లు. ఆయన ఒకప్పుడు ఉదయగిరిలో ఉండేవాడని అంటారు.

✪ ఈ కథను యింకో వెర్షన్‌లో కూడా చెబుతారు. ముస్లింలు నమాజు చదివే ముందు ఒళ్లు శుభ్రం చేసుకోవడానికి 'వజూ' చేస్తారు కదా. 'వజూ' ఇంపార్టెన్స్‌ను తెలియచేయడానికన్నట్టు ఈ కథని మార్చి చెబుతారు. ఈ వెర్షన్‌లో దాల్‌గోట్నీ ఉండదు. బిక్కమొకం వేసుకొని గురువు యింటికి చేరితే, అతడి భార్య 'మరేం పర్వాలేదు. లే.. లేచి వజూ చేసుకో. వజూ నీళ్లతో ఒళ్లు శుభ్రం చేసుకుంటే ఒంట్లో బోలెడంత శక్తి వస్తుంది. మనసుకు ధైర్యం వస్తుంది. వెళ్లి వాణ్ణి ఓడించొచ్చు' అని చెబుతుంది. ఆమె మాట విని గురువు వజూ చేసుకొని వెళ్లి శిష్యుణ్ణి గోదాలో ఓడిస్తాడు.